లక్ష్యం సరే.. రక్షణ చర్యలేవి?

- ఎదగని 'హరితహారం' మొక్కలు
- పోటాపోటీగా నాటుతున్నా..
- సంరక్షణ చర్యలు చేపట్టడంలో అధికారుల నిర్లక్ష్యం


వరంగల్ రోడ్డులో రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ఎదుగుదల లేని మొక్క

హుజూరాబాద్: హరిత తెలంగాణ లక్ష్యంగా పచ్చదనం పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమం అధికారుల నిర్లక్ష్యంతో అభాసుపాలవుతోందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ పరిధిలో అధికారులు టార్గెట్ కోసం పోటాపోటీగా మొక్కలు నాటుతున్నా.. వాటి సంరక్షణ చర్యలు తీసుకోకపోవడంతో మొక్కలు ఎదగకపోగా, ఎండిపోతున్నాయి. నాటిన తర్వాత మొక్కలను సంరక్షిస్తేనే లక్ష్యం నెరవేరుతుందని అధికారులు, ప్రజాప్రతినిధులు మాటలు చెబుతున్నారే తప్పా పట్టించుకుంటున్న దాఖలాలు తక్కువే. ఏటా మొక్కలు నాటే ందుకు రూ.లక్షలు వెచ్చిస్తున్న ప్రభుత్వం క్షేత్రస్థాయిలో వాటి సంరక్షణపై దృష్టి సారించడం లేదనే విమర్శలున్నాయి.

పర్యవేక్షణ లేకనే..

క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో నాటిన మొక్కల చుట్టూ ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు ఉండటంతో నాటిన వాటి ఎదుగుదలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గతేడాది హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలో 60 వేల మొక్కలు నాటాలనే లక్ష్యంతో అధికారులు మొక్కలు పంపిణీ చేశారు. 15 వేల మొక్కలను వార్డుల్లో పంపిణీ చేయగా, 45 వేల మొక్కలను రోడ్లకు ఇరువైపుల, ఖాళీ స్థలాల్లో నాటారు. కానీ సంరక్షణ లేక ముళ్లపొదలు, పిచ్చి మొక్కల్లో చిక్కుకొని కొన్ని అనుకున్నంత మేరకు పెరగలేదు. మరికొన్ని ఎండిపోగా కొన్ని పశువులకు, మేకలకు ఆహారంగా మారిపోయాయి. ఈనేపథ్యంలో ఆశించిన లక్ష్యం నెరవేరలేదు. ఈఏడాది కూడా మున్సిపల్ పరిధిలో లక్ష మొక్కలు నాటాలని అధికారులు టార్గెట్ పెట్టుకొన్నారు. ఇప్పటివరకు 82 శాతం మొక్కలు నాటామని, మరో వారం రోజుల్లో టార్గెట్ పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

ఉపాధిహామీ లేకపోవడంతో...

గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా మొక్కలకు సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. మున్సిపాలిటీల్లో ఈ సదుపాయం లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. ప్రధానంగా రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు చాలా వరకు ముళ్లపొదల మధ్యనే ఉండిపోయాయి. మున్సిపాలిటీల్లో అనుకున్నంత మేరకు సిబ్బంది లేకపోవడంతో కూడా ఒక కారణం. నాటిన మొక్కలకు కనీసం నెలకోసారి వాటి చుట్టూ పెరిగిన పనికిరాని మొక్కలు, ముళ్లపొదలను తొలగించి రక్షణ చర్యలు చేపడితే పరిస్థితి మరో రకంగా ఉండేదని స్థానికులు అంటున్నారు.

చర్యలు తీసుకుంటాం



మున్సిపాలిటీలో సిబ్బంది కొరతతో నాటిన మొ క్కల రక్షణ చర్యలు చేపట్టడం ఇబ్బందిగా ఉంది. ఈసారి లక్ష మొక్కలు నాటాలని టార్గెట్‌గా పెట్టుకున్నాం. నాటిన మొక్కలను రక్షించేందుకు గ్రీన్ బడ్జెట్‌లో 10 శాతం ఖర్చు చేస్తాం. ఇందులో భాగంగా మొక్కల రక్షణ కాంట్రాక్టర్‌కు అప్పగించేందుకు టెండర్ పిలిచాం. మొక్కల రక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, హుజూరాబాద్

క్లుప్తంగా

హైమాస్ట్ లైట్లు ప్రారంభం


హైమాస్ట్ లైట్లు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

చొప్పదండి: మండలంలోని మంగళపల్లిలో జిల్లా పరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ వెల్మ నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్ మోడల్ స్కూల్ ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లకు విద్యార్థులు 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కొడిమ్యాల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం చిగురుమామిడిలో మాట్లాడారు. 2023–24 విద్యా సంవత్సరానికి ఎస్సెస్సీ ఉత్తీర్ణులైన విద్యార్థులు సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లికి చెందిన నిరుపేద మహిళ షాహిద కుమారుడు తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో వైద్యం కోసం దాతల సాయం కోరింది. అబాది జమ్మికుంట గ్రామానికి చెందిన దొడ్డె ఆంజనేయులు(ప్రస్తుత జార్ఖండ్ రాష్ట్రం దుంకా జిల్లా కలెక్టర్)రూ. 25 వేలు అందించారు. ఈసందర్భంగా ఆంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపింది.

దర్గాలో ఎమ్మెల్యే ప్రార్థనలు


చాదర్లు సమర్పిస్తున్న ఈటల రాజేందర్

జమ్మికుంట: మండలంలోని బిజిగిరిషరీఫ్ గ్రామంలో హజ్రత్ సయ్యద్ ఇంకుషావలి దర్గాను హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సోమవారం దర్శించుకున్నారు. మత గురువు మౌలానా యాసిన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముందుగా దర్గా కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు స్వాగతం పలికి, వాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ కార్యనిర్వహణ అధ్యక్షుడు మొహమ్మద్ తౌపిక్ హుస్సేన్, కోశాధికారి, సభ్యులు అహ్మద్, లతీఫ్ హుస్సేన్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

7న కలెక్టరేట్ ఎదుట ధర్నా


మాట్లాడుతున్న సుంకరి సంపత్

మానకొండూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట ఈ నెల7న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం మానకొండూర్ జోన్ కార్యదర్శి సుంకరి సంపత్ అన్నారు. ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై సదాశివపల్లి చౌరస్తాలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ... దేశంలో కోట్లాది మంది పేదరికంలో మగ్గుతున్నారని, 2014 ధరలను పోల్చి చూస్తే యాభై నుంచి రెండు వందల శాతం పెరిగాయని, ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గట్టు సతీశ్, రమేశ్, చిరంజీవి, గంజాల గోపి, కిషోర్, నెల్లి రాజయ్య, వనం ప్రకాశ్, వెంకటేశ్, బిలవేని నరేశ్, సమ్మయ్య, రవి పాల్గొన్నారు.

తాడికల్‌లో విద్యుత్ వినియోగదారుల సదస్సు

శంకరపట్నం: మండలంలోని తాడికల్‌లో సోమవారం విద్యుత్ వినియోగదారుల సమస్యలు, పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. శంకరపట్నం, వీణవంక, సైదాపూర్ మండల ప్రజలు పాల్గొన్నారు. రైతులు సమస్యలను అధికారులకు విన్నవించారు. ఈకార్యక్రమంలో ఎస్ఈ గంగాధర్, డీఈ లక్ష్మారెడ్డి, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ సంపత్ రెడ్డి, కుమారస్వామి, రవీందర్, ఆంజనేయులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా, మండల కమిటీలు


బీసీ సంక్షేమ సంఘం నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుంకరి యాదయ్య, జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎగిత రవీందర్, జిల్లా సహాయ కార్యదర్శిగా నీల కుమారస్వామి, జమ్మికుంట బీసీ సంఘం మండల మహిళా అధ్యక్షురాలిగా ఇటికాల స్వరూప, జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం మండల ఉపాధ్యక్షులుగా టంగుటూరి సుజాత, విజిగిరి మంజుల, మండల ప్రధాన కార్యదర్శిగా కేశ స్వరూప, కార్యదర్శిగా నేదురి రజిత, సహాయ కార్యదర్శిగా ఇరవేని మణెక్క, కార్యవర్గ సభ్యులుగా ముకుంద అనితను జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య ఆదేశాల మేరకు కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం పటేల్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు సుక్కల గంగాభవాని, వర్కింగ్ ప్రెసిడెంట్ చిగుర్ల శ్రీనివాస్ కురుమ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ జయప్రద


తిమ్మాపూర్: భోజనం చేస్తున్న గర్భిణులు

రామడుగు: మండలంలోని చిప్పకుర్తి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం పోషకాహార వారోత్సవం నిర్వహించారు. పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మంచి పోషకాలతో కూడిన ఆహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీటీచర్ వరలక్ష్మీ, రమ్య, బాలింతలు, గర్భిణులు, మహిళలు పాల్గొన్నారు.

చొప్పదండి: తల్లీ, పిల్లలకు పోషకాహారం అందించి అనారోగ్యం నుంచి కాపాడాలని ఎంపీపీ చిలుక రవీందర్ అన్నారు. మండలంలోని ఆర్నకొండలోని నోముల రాజయ్యపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణా మాసం సందర్భంగా నిర్వహించిన అవగాహన సమావేశానికి హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సునంద, సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు.

తిమ్మాపూర్: జాతీయ పోషణ మాసంలో భాగంగా సెప్టెంబర్ నెలంతా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తామని మెడికల్ ఆఫీసర్ ప్రణవ్ తెలిపారు. తిమ్మాపూర్ పీహెచ్‌సీలో గర్భిణులకు పౌష్టికాహారం, తల్లిపాల ప్రాముఖ్యత గూర్చి వివరించారు. అదనపు ఆహారం, ముర్రుపాల విశిష్టత, సాధారణ ప్రసవాల, ఎనీమియాపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీలత, ఇశ్రాత్ సుల్తానా, పద్మ, తిమ్మాపూర్ అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే రసమయి బాలకిషన్


మొక్కులు చెల్లిస్తున్న ఎమ్మెల్యే రసమయి

శంకరపట్నం: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని, అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని మొలంగూర్‌లో సోమవారం అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన, నూతన గ్రామ పంచాయతీ, మహిళా సమైఖ్య, ఆయుర్వేద వైద్యశాల, రజక కమ్యూనిటీ భవనాలకు శంకుస్థాపన చేశారు. చింతలపల్లె గ్రామంలోని పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆయాగ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్నివర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, రాబోయే రోజుల్లో ప్రతి పేద విద్యార్థికి కార్పొరేట్ విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు ఇతర దేశాల్లో ఉన్నత విద్యనభ్యసించటానికి ప్రభుత్వం రూ.20 లక్షలు అందజేస్తుందని అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజలు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో వైద్యశిబిరం


విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెల్పూర్ వైద్యాధికారి మధుకర్ అన్నారు. మండలంలోని దమ్మక్కపేట గ్రామ పంచాయతీ పరిధి కేసీ క్యాంప్‌లోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు శుభ్రతను తప్పనిసరిగా పాటించాలన్నారు. అనంతరం 44 మంది విద్యార్థినులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. చెల్పూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హాస్టల్ ప్రిన్సిపాల్ మీనాక్షి, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ స్నిగ్ధ, హెల్త్ ఎడ్యుకేటర్ రేష్మా, ఏఎన్ఎం విజయలక్ష్మి, కోమల ఆశావర్కర్ లత, శ్రీలత పాల్గొన్నారు.

ఆలస్యంగా విద్యార్థులు.. అనుమతించని అధికారులు


కంటతడితో వెనుదిరుగుతున్న విద్యార్థులు

తిమ్మాపూర్: టీఎస్‌పీఎస్సీ నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ లెక్చరర్ ఎగ్జామ్‌కు ఆలస్యంగా వచ్చిన 15 మంది విద్యార్థులను అధికారులు మండల కేంద్రంలోని ఓ కళాశాలలోనికి అనుమతించలేదు. కళాశాల గేట్ లోపలికి వచ్చాక కూడా లోనికి అనుమతించకపోవడంతో కళాశాల సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అయినా తనుమతించకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు. టైం అనంతరం లోనికి రావడంతో అనుమతించలేదని నిర్వాహకులు తెలిపారు.

రజక సంఘం శంకరపట్నం మండల అధ్యక్షుడిగా తిరుపతి


ఎన్నికైన సభ్యులు

శంకరపట్నం: రజక సంఘం శంకరపట్నం మండల అధ్యక్షుడిగా తాడిచర్ల తిరుపతిని సోమవారం సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడు దండు కొమురయ్య మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో సంఘం బలోపేతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో సంఘం'సభ్యులు క్రాంతికుమార్, కిరణ్, ఎల్లయ్య, రాజయ్య, కొమురయ్య, వంకటేశ్, సంతోష్, సంపత్, అనిల్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

తాడికల్ సొసైటీ సమావేశం బహిష్కరించిన సభ్యులు

శంకరపట్నం: మండలంలోని తాడికల్ సహకార సంఘం సమావేశాన్ని సొసైటీ సభ్యులు సోమవారం బహిష్కరించారు. సంఘం అధ్యక్షుడు కేతిరి మహేందర్‌రెడ్డి సభ్యులపై మాట్లాడిన తీరును నిరసిస్తూ సమావేశం బహిష్కరించామని సభ్యులు ఆరోపించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో జరగాల్సిన సమావేశంలో సభ్యుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం, ఏకవచనంతో సంబోధించడం, సభా మర్యాదలను ఉల్లంఘించడమేనని, లోన్లు మంజూరు విషయంలో రైతులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. సభ్యుల వాదోపవాదనలు, గందరగోళంతో సహకార సంఘం సమావేశం వేడెక్కింది. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు హనుమంతరావు, నరహరి, శ్రీనివాస్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మానకొండూర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను తక్షణం పరిష్కరించాలని లేదంటే సెప్టెంబర్ 11 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తామని సోమవారం తహసీల్దార్ రాజుకు మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీ టీచర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు కె.అరుణ మాట్లాడుతూ... రాష్ట్రంలో సుమారు 70 వేలమంది టీచర్లు పనిచేస్తున్నారని, కనీస వేతనం, ఈఎస్ఐ, ఉద్యోగభద్రత కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, హెల్త్‌కార్డులు ఇవ్వాలని, ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశఋూరు.

గన్నేరువరం: సమస్యల సాధనకు సంబంధించి తహసీల్దార్ భిక్షపతికి అంగన్‌వాడీ టీచర్లు సమ్మె నోటీస్ అందజేశారు. 10వ తేదీ వరకు విధుల్లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తామన్నారు. 11న అంగన్‌వాడీ కేంద్రాలను బంద్ చేస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రజిత, శారద, సరోజన, శ్యామల, రాజేశ్వరీ, పుష్పలత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

- పెళ్లి కావడం లేదని ఈనెల 2న ఆత్మహత్యాయత్నం


కార్తీక్ (ఫైల్)

ఇల్లందకుంట: పెళ్లి కావడం లేదని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన ఓల్లాల సర్వయ్య–పద్మ దంపతులకు ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు కార్తీక్ (29)కు ఎన్ని పెళ్లి సంబంధాలు చూసినా కుదరడం లేదు. దీంతో తనకు వివాహం జరగడం లేదన్న మనస్తాపంతో ఈ నెల 2న క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హనుమకొండ తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

బ్రిడ్జి నిర్మించాలని వినతి

గన్నేరువరం: కరీంనగర్ నుంచి గన్నేరువరం వరకు మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చామని మానేరు బ్రిడ్జి సాధన సమితి చైర్మన్ సంపతి ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్ఎండీ నిర్మాణ సమయంలో మండల వాసులకే ఎక్కువ అన్యాయం జరిగిందని, విలువైన భూములు, ఇళ్లు కోల్పోయారని, డ్యామ్ నిర్మాణానికి ముందు గన్నేరువరం నుంచి కరీంనగర్ వరకు తొమ్మిది కిలోమీటర్ల దూరం మాత్రమే ఉండగా ప్రస్తుతం 45 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మండలం అభివృద్ధిలో వెనుకంజలో ఉందని, విద్య, వైద్యం కోసం సుదూరం ప్రయాణించాల్సి వస్తోందన్నారు. బ్రిడ్జి నిర్మించి మండల అభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలకు సహకరించాలని కోరారు. దీనికి సహకరించిన పార్టీలకే వచ్చే ఎన్నికల్లో ఈ ప్రాంత ప్రజల మద్దతు ఉంటుందన్నారు. వెంట ప్రధాన కార్యదర్శి రాములు, కోశాధికారి వెంకటేశం, సహాయ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్నికలు జరపాలని..

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి మత్స్యపారిశ్రామిక సహకార సంఘం పాలకవర్గం పదవీకాలం ముగిసి దాదాపు తొమ్మిది నెలలు గడిచాయని, ఎన్నికలు జరపాలని అధికారులను కోరినా వినడంలేదని ఆరోపిస్తూ సంఘంలోని సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. అధ్యక్షుడు కొత్త సభ్యత్వాల కోసం ఒక్కొక్క సభ్యుడి నుంచి రూ.2,500 చొప్పున రూ. ఆరు లక్షలు వసూలు చేసి స్కిల్ టెస్టు నిర్వహించి వదిలేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. మత్స్యశాఖ అధికారులు కూడా గతంలో పనిచేసిన అధ్యక్షుడికే వంతపాడుతున్నారని, కొత్త సభ్యత్వాలు ఇవ్వడంలేదన్నారు. తక్షణం జోక్యం చేసుకుని కొత్త సభ్యత్వాలు జారీతో పాటు నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు.

అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు

వీణవంక: తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ కింది స్థాయి ఉద్యోగి రైతుల నుంచి డబ్బులు వసూల్ చేస్తున్నాడని మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన అప్పని హరీశ్‌వర్మ సోమవారం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయికి ఫిర్యాదు చేశాడు. కేడీసీసీ బ్యాంకులో రుణం కోసం మాడిగేజ్ పెట్టుకున్నామని తహసీల్దార్ కార్యాలయంలో మాడిగేజ్ చేసిన తర్వాత సదరు ఉద్యోగి రూ.500లు అడిగాడని, అదేవిధంగా పలువురు రైతుల నుంచి బలవంతంగా డబ్బులు వసూల్ చేస్తున్నాడని జేసీకి ఫిర్యాదు చేసినట్లు హరీశ్‌వర్మ తెలిపారు. ఆయనపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరానని వివరించారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

చొప్పదండి: మండలంలోని దేశాయిపేటకు చెందిన మాజీ సర్పంచ్ శారద, చంటిబాబులు సోమవారం బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు ఇరవై మంది గ్రామస్తులు పార్టీలో చేరగా వారికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గుంట రవి, సుద్దాల శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని కలిసిన ఆర్‌ఎంపీ, పీఎంపీలు


కౌశిక్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలు

హుజూరాబాద్: సీఎం కేసీఆర్ హుజూరాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని ప్రకటించగా సోమవారం విఘ్నేశ్వర ఆర్‌ఎంపీ, పీఎంపీల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో కౌశిక్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కందగట్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎర్రోళ్ల సదానందం, కన్నెబోయిన తిరుపతి, ప్రధాన కార్యదర్శి చిలుకమారి శ్రీనివాస్, కోశాధికారి కమలాసింగ్, డివిజన్ జనరల్ సెక్రెటరీ కొక్కుల రవీందర్, రామరాజు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని కోర్కల్ గ్రామంలో నిర్మిస్తున్న ఎల్లమ్మ గుడి దర్వాజ ఎత్తే కార్యక్రమం, పూజల్లో కౌశిక్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం రాబోయే ఎన్నికల్లో మళ్లీ బీఆర్‌ఎస్ గెలుస్తుందని దీమా వ్యక్తం చేశారు. వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మునిపట్ల తిరుపతిరెడ్డి, మర్రి స్వామి, సంగ సమ్మయ్య, బీఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేలిన కంప్రెషర్



శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామంలో సోమవారం టైర్ల కొట్టులోని కంప్రెషర్ పేలింది. గ్రామానికి చెందిన చీకట్ల సంపత్ కొట్టు నిర్వహిస్తున్నాడు. హార్వెస్టర్ టైర్‌లో గాలి నింపుతుడగా ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలింది. రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. ఘటనలో సంపత్, హార్వెస్టర్ డ్రైవర్ మరికొంత మంది దూరంగా ఉండటంతో పెను ప్రమాదం తప్పింది.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO – 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ – 9618304759
చొప్పదండి : మొండయ్య – 7997958217
మానకొండూర్ : మహేశ్ – 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ – 7331119941
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com